క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: కొండమాయపల్లె పంచాయతీ మజరా వెలగలపల్లె పొలిమేరలో వెలసిన వాసాపురం వేంకటేశ్వర స్వామి వారికి భక్తులు శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అర్చకులు గోపీ శర్మ,శివ ఉదయాన్నే లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన అభయాంజనేయ స్వామి, శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, కుంకుమార్చన, వడమాల, ఆకుపూజలు చేశారు. అనంతరం అర్చకులు లక్ష్మణస్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



గోవిందపల్లె ఖోఖో జట్టు

శిరివెళ్ల: ఆడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా ఖోఖోలో జిల్లాస్థాయి పోటీలకు గోవిందపల్లె సచివాలయం–2 జట్టు ఎంపికైందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. ఆ జట్టు సచివాలయ, మండల, నియోజకవర్గ స్థాయి పోటీల్లో గెలుపొందడంతో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైందని చెప్పారు.

శ్రీకృష్ణదేవరాయలు జయంతి



శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ఆంధ్రభోజుడు, విజయనగర సామ్రాజ్యాధీశుడు శ్రీ శ్రీకృష్ణదేవరాయలు జయంతిని శనివారం నిర్వహించారు. నియోజకవర్గ బలిజ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి ఎన్నిక



నియామక పత్రం అందుకుంటున్న శ్యాంసుందర్‌గుప్త

నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన ఆర్యవైశ్య నాయకుడు బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. శనివారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం రాత్రి గుంటూరులో జరిగిన మహాసభ ప్రమాణస్వీకారం సందర్భంగా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాం చిన్నసత్యనారాయణచే ప్రధాన కార్యదర్శిగా ప్రమాణస్వీకారం చేయించి ప్రమాణస్వీకార పత్రాన్ని అందజేశారన్నారు. ఆయనను సంఘం పట్టణ నాయకులు నాగరాజు, జనార్దన్, సుప్రజ, ధనుంజయుడు, సతీష్ అభినందించారు.

పార్వేట పల్లకీకి పూజలు



పూజలందుకున్న ఉత్సవ మూర్తులు


రుద్రవరం: పార్వేట ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, ప్రహ్లాదవరద స్వామికి ఊరూరా ప్రజలు హారతులు పడుతున్నారు. తిమ్మనపల్లికి చేరుకున్న పల్లకీకి శనివారం ఉదయం గ్రామస్తులు విశేష పూజలు చేపట్టారు. గ్రామంలోని ఐదు తెలుపులపై పల్లకీ కొలువు దీరగా ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం బోయిలు పల్లకీని మండల పరిధిలోని నర్సాపురం గ్రామానికి తరలించారు. అక్కడ గ్రామ పెద్దలు మేళ తాళాలతో ఎదురేగివెళ్లి పూజలు చేసి ఘన స్వాగతం పలికారు.

నీటి కష్టాలకు చెక్

దాహంతో అల్లాడుతున్న ప్రజలకు కనీసం గొంతు తడుపుకునేందుకు నీటి సౌకర్యం కల్పించలేదు గత ప్రభుత్వం.. వివిధ సందర్భాల్లో ఆయా గ్రామాల ప్రజలు ప్రజా ప్రతినిధులు, అధికారులకు మొర పెట్టుకున్నా కనికరించలేదు. దీంతో నీటి కోసం అష్టకష్టాలు పడ్డారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సమస్య పరిష్కారానికి రూ.1.49 కోట్లు వెచ్చించి ఓవర్ హెడ్ ట్యాంకులు, పైప్‌లైన్ పనులు పూర్తి చేయడంతో పుష్కలంగా నీరందుతోంది.

- రూ. 1.49 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకులు, పైపులైన్ పనులు పూర్తి
- దశాబ్దాలుగా అవస్థలు పడుతున్న జనం
- ఐదు గ్రామాల ప్రజలకు తప్పిన ఇబ్బందులు
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం





ఉయ్యాలవాడలో నూతనంగా నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు



గోవిందపల్లె గ్రామంలో నిర్మించిన నూతన ఓవర్‌హెడ్ ట్యాంకు



ఉయ్యాలవాడలో కుళాయి నుంచి నీటిని పట్టుకుంటున్న మహిళ ప్రభావతి

ఉయ్యాలవాడ : మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో దశాబ్దాలుగా నీటి సమస్య వేధిస్తోంది. పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు గత ప్రజాప్రతినిధులను వేడుకున్న గొంతు తడపలేకపోయారు. అయినా జనం ఇబ్బందుల్లో గడిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక పరిస్థితిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. నీటి సమస్య పరిష్కారానికి రూ.1.49 కోట్లు కేటాయించింది. వీటితో ఆయా గ్రామాల్లో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. దీంతో మంచినీటి ఇబ్బందులకు పరిష్కారం లభించింది. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని గోవిందపల్లె గ్రామంలో 40 వేల లీటర్ల సామర్థ్యంతో రూ. 20 లక్షలతో చేపట్టిన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం పూర్తయ్యింది. నూతనంగా మండల కేంద్రమైన ఉయ్యాలవాడలో రూ.కోటి వ్యయంతో 1.20 లక్షలు, 40 వేల లీటర్ల సామర్థ్యంతో రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు, కుందూనది నుంచి ట్యాంకులకు నీటి సరఫరా చేసేందుకు పైపులైన్ పనులు ముగించారు. అలాగే బోడెమ్మనూరు, పుచ్చకాయలపల్లె, నర్సిపల్లె, రూపనగుడి గ్రామాల్లో రూ. 22 లక్షలతో చేపట్టిన మంచినీటి సరఫరా పైపులైన్ పనులు పూర్తి చేయడంతో ప్రజలకు మంచినీటి కష్టాలు తప్పాయి.

భయం తొలిగింది



శివాలయ ఆవరణలో ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎప్పుడు కూలుతుందోనని భయంగా ఉండేది. ఆలయం దర్శనం కోసం వచ్చే భక్తులు, అటు వైపు ప్రజలు నిత్యం భయాందోళన చెందేవారు. గతంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. జగనన్న ప్రభుత్వం వచ్చాక నూతన ట్యాంకు నిర్మించారు. అలాగే ట్యాంకు సామర్థ్యం కూడా పెంచడంతో కుళాయిలకు నీరు పుష్కలంగా వస్తున్నాయి.

– ఉమామహేశ్వరరమ్మ, ఉయ్యాలవాడ

అవస్థలు తప్పాయి



మా కాలనీలో 120 గృహాలు ఉన్నాయి. గత పదేళ్లుగా మంచి నీటి కష్టాలు ఎదుర్కొంటున్నాం. మోడల్ స్కూల్ సమీపంలో నూతనంగా ట్యాంకు నిర్మించడంతో పాఠశాల విద్యార్థులతో పాటు తమ కాలనీకి మంచినీటి కష్టాలు తప్పాయి.

– హుసేన్ బాషా, బీసీ కాలనీ, ఉయ్యాలవాడ

ప్రభుత్వానికి రుణపడి వుంటాం



మా గ్రామం ఏర్పడిన తరువాత ఎన్నడూ లేనంత అభివృద్ధి ఇప్పుడు జరిగింది. మండలంలో ఓవర్‌హెడ్ ట్యాంకు లేని గ్రామం ఉందంటే అది మా గ్రామమే. ఈ ప్రభుత్వం వచ్చాకనే మా గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్, తారురోడ్డు వేశారు. రహదారి కష్టాలతో పాటు మా గ్రామ ప్రజలకు మంచినీటి కష్టాలు కూడా తొలిగాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి గ్రామస్తులమంతా రుణపడి ఉంటాం.

– దస్తగిరి సాహెబ్, గోవిందపల్లె

ఎంపీడీఓ బదిలీ

ఉయ్యాలవాడ : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు వైఎస్సార్ కడప జిల్లాకు బదిలీ చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులు శనివారం కార్యాలయానికి అందాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సొంత జిల్లాలో ఉన్న అధికారులను ఇతర జిల్లాలకు బదిలీ చేయాలనే నిబంధనల మేరకు ఉన్నతాధికారులు బదిలీ చేశారు.

బిల్లులు వసూలు చేయాలి

గోస్పాడు: వినియోగదారుల నుంచి విద్యుత్ బిల్లులు సకాలంలో వసూలు చేయాలని ఏఈ జ్ఞాన సూర్యుడు తెలిపారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీటరు లేకుండా విద్యుత్‌ను వినియోగిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పారు.లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

నంద్యాల(న్యూటౌన్): వైఎస్సార్ క్రాంతిపథకం ఉద్యోగులను రెగ్యులర్ చేసి, కారుణ్య నియామకాలు చేపట్టాలని జేఏసీ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, చైర్మన్ పుల్లయ్య కోరారు. శనివారం పట్టణంలోని బొమ్మలసత్రం సర్కిల్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఈపీఎఫ్‌ను బేసిక్‌పై వంద శాతం ఇవ్వాలని, హెచ్‌ఆర్‌సీ పాలసీ వర్తింపజేయాలన్నారు. అన్ని క్యాడర్స్ వారికి ప్రమోషన్‌తో కూడిన ఇంక్రిమెంట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జేఏసీ కన్వీనర్లు వాడాల రవికుమార్, కృష్ణారెడ్డి, ఎల్లయ్య, దానం, శ్రీనివాసులు, సెర్ప్ మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి



దీబగుంట్లలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఈఈ శ్రీహరిగోపాల్

గోస్పాడు: నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను గ్రామాల్లో వేగంగా పూర్తి చేయాలని నంద్యాల డివిజన్ ఈఈ శ్రీహరిగోపాల్ తెలిపారు. శనివారం మండలంలోని పసురపాడు, దీబగుంట్ల, గోస్పాడు గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం గోస్పాడులోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నంద్యాల డివిజన్ పరిధిలోని 13 మండలాలు, రెండు అర్బన్ ప్రాంతాల్లో 18,668 ఇళ్లు మంజూరు కాగా వాటిలో 11,498 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 3,380 బేస్‌మెంట్ స్థాయిలో ఉండగా మిగిలినవి వివిధ దశల్లో ఉండగా, 167 ఇళ్లకు సంబంధించిన నిర్మాణాలు ఇప్పటి వరకు ప్రారంభం కాలేదని, అవి కూడా పనులు ప్రారంభించేలా లబ్ధిదారులకు సిబ్బంది అవగాహన కల్పించాలని ఆదేశించారు. సిబ్బంది తరచూ పర్యవేక్షిస్తూ లబ్ధిదారులతో మాట్లాడి పురోగతి సాధించేలా చూడాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ వర్మ, హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణ తలంబ్రాలకు అంకురార్పణ



వడ్లను కవర్లలో నింపుతున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని మనఊరు, మనగుడి, మన బాధ్యత బృందం ఆధ్వర్యంలో ఒంటిమిట్టలో జరిగే సీతారాముల కల్యాణానికి అవసరమైన తలంబ్రాలు సిద్ధం చేయడానికి శనివారం అంకురార్పణ కార్యక్రమం రోజా కుంట నాగలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంతో పండించిన వడ్లను ప్యాకెట్లలో నింపి మహిళలకు అందజేస్తామని, వాటిని శ్రీరామ నామ జపం చేస్తూ గోటితో ఒలవాలని చెప్పారు. పూర్తయిన తరువాత ఒంటిమిట్టకు పంపుతామని తెలిపారు. ఈ వడ్లు ఒలిచే కార్యక్రమంలో పాల్గొనే మహిళలు సెల్: 7013185604, 9247244037 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మేనిఫెస్టోలో సీమ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి



నిజదర్శన దీక్షలో పాల్గొన్న నాయకులు

నంద్యాల (సెంట్రల్): రాబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో రాయలసీమ హక్కులకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. శనివారం నంద్యాల తాలూకా కార్యాలయం ఎదురుగా సమితి లాయర్ భూమా కృష్ణారెడ్డి అధ్యక్షతన రాయలసీమ నిజదర్శన దీక్ష నిర్వహించారు. ఫిబ్రవరి మొదటి వారంలో రాయలసీమ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కర్నూలు అనంతపురం, కడప, తిరుపతి కేంద్రాల్లో రాయలసీమ దీక్ష కార్యక్రమం చేపట్టాలని తీర్మానించారు. కార్యక్రమంలో బాల ఉశేని బృందం ఆలపించిన సీమపాటలు అలరించాయి. కార్యక్రమంలో ఓడీపీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, రాయలసీమ సాంస్కృతిక వేదిక కన్వీనర్ డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి, జలసాధన సమితి నాయకులు చైతన్య గంగిరెడ్డి, ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు మణెమ్మ, కడప రైతు సేవా సమితి నాయకులు రమణ, అనంతపురం జిల్లా రైతు సంఘం నాయకుడు వెంకట్రామిరెడ్డి, రాయలసీమ విద్యావంతుల వేదిక భాస్కర్ రెడ్డి, ఆర్టీపీపీ కార్మిక సంఘం నాయకుడు సుబ్బారెడ్డి, వైఎస్సార్ కడప జిల్లా న్యాయవాద సంఘం నాయకులు నాగరాజు, ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, కర్నూలు జిల్లా సాగునీటి సాధన సమితి కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, ఆదోని అభివృద్ధి వేదిక అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, రైతు కూలీ సంఘం నాయకుడు రాజశేఖర్, ప్రముఖ పారిశ్రామికవేత్త ఆత్మకూరు రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

31లోగా అభ్యంతరాలను తెలపండి

నంద్యాల(అర్బన్): జిల్లా బాలల సంరక్షణ విభాగం (మిషన్ వాత్సల్య)లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచామని, పరిశీలించుకొని ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 31వ తేదీలోగా తమ కార్యాలయంలో రాత పూర్వకంగా తెలపాలని జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి నిర్మల శనివారం ఒక ప్రటకనలో కోరారు. 30-10-2023 జారీ చేసిన నోటిఫికేషన్, సవరణ నోటిఫికేషన్ ప్రకారం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. ఇంతకు మునుపు అభ్యర్థుల నుంచి స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హత పొందిన అభ్యర్థులు, అర్హత లేని అభ్యర్థుల వివరాల జాబితాను రూపొందించామన్నారు. అభ్యర్థుల వివరాలను https://nandyal.ap.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు.

మెడికల్ క్యాంపునకు స్పందన

నంద్యాల(వ్యవసాయం): స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. కార్యక్రమాన్ని అసోసియేషన్ అధ్యక్షుడు బొల్లెద్దుల రవీంద్రనాథ్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. జడ్జి మాట్లాడుతూ న్యాయవాదులు శిబిరంలో చికిత్స చేయించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



తగరం లలితమ్మ

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామానికి చెందిన తగరం లలితమ్మ (43) అనే వివాహిత అదృశ్యమైందని ఏఎస్ఐ ప్రతాపరెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 25న ఉదయం పొలం పనులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కంగారు పడిన కుటుంబీకులు పలు చోట్ల ఆరాతీసినా ఆచూకీ తెలియలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. భర్త పెద్ద ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చెప్పారు.

29న ప్రధానితో పరీక్షపే చర్చ

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 29వ తేదీన ఉదయం 11గంటలకు ప్రధాని నరేంద్రమోదీ పరీక్షపే చర్చ కార్యక్రమం ఉంటుందని డీఈఓ సుధాకర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అన్ని దూరదర్శన్ చానెల్ ద్వారా, ప్రధాన, ప్రైవేటు చానల్స్, రేడియో, యూట్యూబ్ లింక్‌ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించాలని సూచించారు. కార్యక్రమాన్ని DD National,www.mygov.in యూట్యూబ్ చానల్ ద్వారా లైవ్ టెలికాస్ట్‌లో పిల్లలకు వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా

నంద్యాల(సిటీ): పట్టణంలోని వైఎస్ నగర్‌లో రూ. 1.50 కోట్లతో గ్రావెల్ రోడ్లు, పైప్ లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణానికి కౌన్సిలర్ సావిత్రమ్మ, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ రమణతో కలిసి మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా శనివారం భూమి పూజ చేశారు. చైర్ పర్సన్ మాట్లాడుతూ వైఎస్ నగర్ తమ పాలనలో అభివృద్ధి బాటలో నడుస్తోందన్నారు. ఇదివరకే రూ.కోటితో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించిన పది రోజుల్లో మరోసారి అభివృద్ధి పనులకు భూమి పూజ చేయడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే కాలనీ రూపు రేఖలు మరిపోయాయన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున టీడీపీ నాయకులు దుష్ప్రచారానికి తెరలేపారన్నారు. జగనన్న చేసిన మంచిని ప్రజలు గుర్తుంచుకుని మరోమారు సీఎంగా గెలిపించుకుందామని కోరారు. నాయకులు నరసింహులు, అన్వర్ బాషా, సోమశేఖర్, శివకృష్ణ, అంకాలయ్య, తిరుపతయ్య పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం కృషి

- పట్టణంలోని పలు వార్డుల్లో వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు



9వ వార్డులో మాట్లాడుతున్న మెప్మా సీఎంఎం విజయ భాస్కర్ రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న 39వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీదేవి

నంద్యాల(సిటీ): మహిళా సాధికారత కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు వారి పేరుతోనే అమలు చేస్తున్నారని, ఇందులో వైఎస్సార్ ఆసరా వారికి అండగా నిలిచిందని కౌన్సిలర్లు పేర్కొన్నారు. పట్టణంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 7, 8, 9, 38, 39 వార్డుల్లో శనివారం నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు కౌన్సిలర్ల ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 2019 ఎన్నికల నాటికి పొదుపు సంఘాల పేరిట మహిళలకు బ్యాంకుల్లో ఉన్న అప్పు మొత్తాన్ని ప్రభుత్వం చెల్లించేలా వైఎస్సార్ ఆసరా పథకం అమలు చేస్తున్నారని కొనియాడారు. రుణ మాఫీలో భాగంగా వారి ఖాతాల్లో జమ చేసిన మొత్తాన్ని మహిళలు జీవనోపాధులకు వినియోగించుకొని ఆర్థికంగా స్థిరపడే దశలో ఉన్నారని చెప్పారు. ఆయా వార్డుల కౌన్సిలర్లు కలాం బాషా, దండే నాగమ్మ, వెంకట లక్ష్మమ్మ, సావిత్రమ్మ, తౌహిద్, వార్డు ఇన్‌చార్జ్‌లు, మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి, సీఓలు, ఆర్పీలు, సభ్యులు పాల్గొన్నారు.

నాడు–నేడుతో బడులకు కొత్తరూపు



పూర్వ విద్యార్థులకు డిజిటల్ విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు

- చాపిరేవులలో 1979-2022 పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- ప్రభుత్వ చర్యలపై అభినందనల వెల్లువ

నంద్యాల(అర్బన్): నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం సర్కారు బడులను తీర్చిదిద్దిందని, అలాగే విద్యకు పెద్దపీట వేసి ఆధునిక పద్ధతుల్లో బోధన, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌ల పంపిణీ, ఎల్‌ఈడీ స్క్రీన్‌లు తదితర వాటితో విద్యార్థులను తీర్చిదిద్దడం అభినందనీయమని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. నంద్యాల మండలం చాపిరేవుల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సాయంత్రం 1979-2022 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల చదువులు వస్తున్న ఫలితాలపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుత పాఠశాల 1979లో సమితి అప్పర్ ప్రైమరీ పాఠశాలగా ఆవిర్భవించింది. ఎర్రబోలు సుబ్బారెడ్డి, చంద్రమ్మ సహకారంతో పాఠశాల ఏర్పాటుకు పునాదులు పడ్డాయి. ప్రస్తుతం నాడు-నేడుతో కొత్త రూపు దిద్దుకుంది.

డిజిటల్ విద్యతో మెరుగైన ఫలితాలు



1984-85లో పదవ తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలలో కనీస వసతులు లేవు. ఆరుబయట మట్టిలో కూర్చొని చదువుకున్నాం. నేడు పరిస్థితి పూర్తిగా మారింది. విద్యార్థులకు ప్రభుత్వం బల్లలు ఏర్పాటు చేయడం అభినందనీయం. విద్యార్థులకు డిజిటల్ విద్యను అందిస్తున్న ప్రభుత్వాన్ని మెచ్చుకోక తప్పదు. – కేవీ సుబ్బారెడ్డి, పూర్వ విద్యార్థి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

పాఠశాలల రూపురేఖలు మారాయి



ప్రస్తుత ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుంది. పేదవాడు సంపన్నుడు అనే తేడా లేకుండా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించింది. నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. వసతులు బాగున్నప్పుడే విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపుతారు. ప్రభుత్వం మంచి పనులు చేపట్టడం బాగుంది.

-అప్పిరెడ్డి, పూర్వ విద్యార్థి, పాండురంగాపురం

ప్రారంభానికి సిద్ధంగా..

- హైలెవెల్ బ్రిడ్జికి రూ. 8.9 కోట్లు మంజూరు
- రూ.7.38 కోట్లతో శిరివెళ్ల- చందలూరు తారు రోడ్డు
- రూ. 94.95 లక్షలతో 17 సీసీ రోడ్లు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి, గంగుల ప్రభాకర్ రెడ్డి



శిరివెళ్ల- చందలూరుకు మధ్య వేసిన తారు రోడ్డు



75 ఏళ్లకు ఎస్సీ కాలనీకి వేసిన సిమెంట్ రోడ్డు



సలాది పేటకు వేసిన సీసీ రోడ్డు

శిరివెళ్ల: మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత కోట్ల రూపాయల్లో పనులు జరిగాయి. తాజాగా రూ. 94.95 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం, మండల పరిషత్, పంచాయతీ నిధులు, ఉపాధి పథకం, నియోజక వర్గ అభివృద్ధి నిధులతో సిమెంట్ రోడ్లు పూర్తి చేశారు. ఈ నెల 28వ తేదీన జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి ప్రారంభించనున్నారు. అలాగే పీఎంజీవై నిధులు రూ.7.38 కోట్లతో శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ మండలాల మధ్య 13.07 కి.మీ. మేర వేసిన తారు రోడ్డును ప్రారంభించనున్నారు. ఇక దాదాపు 75 ఏళ్ల తర్వాత ఎస్సీ కాలనీకి రూ.35 లక్షలతో సీసీ రోడ్డు వేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం గ్రామంలో 17 అంతర్గత సిమెంట్ రోడ్లను వారు ప్రారంభిస్తారు. ఇందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్త చేశారు. అలాగే.. శిరివెళ్ల-చందలూరు మధ్యన వక్కిలేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణానికి రూ.8.9కోట్లు మంజూరయ్యాయని పీఆర్ ప్రాజెక్టు ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. ఈ వంతెన నిర్మిస్తే శిరివెళ్ల, ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల రైతులకు ఉపయోగపడనుంది.